

## ప్రశ్నించే గొంతుక మజ్లిస్

రోడ్డుషోలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

2

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# మైనర్ బాలికపై అఘాయిత్యం- నిందితునికి 20 ఏళ్ల జైలు

### ఎస్పి స్నేహా మెహ్రా వెల్లడి

**వికారాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మైనర్ బాలికపై అగాయిత్యానికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.20 వేల రూపాయల జరిమానా కోర్టు విధించినట్లు జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు జిల్లా ఎస్పీ వెల్లడించారు. 2023 సంవత్సరంలో వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వికారాబాద్ మండలానికి చెందిన అత్వెల్లి నరేందర్ (అలియాస్ నరేష్) అనే వ్యక్తి ఒక మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు పోక్సో చట్టం కేసు నమోదు చేసి చేశారు. ఈ కేసు విచారణ వికారాబాద్‌లోని మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సీహెచ్.చంద్ర కిషోర్ సమక్షంలో జరిగింది. పోలీస్ అధికారులు సమర్పించిన సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 20 వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. బాధితురాలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల నష్టపరిహారాన్ని అందజేయాలని కోర్టు ఆదేశించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా పకడ్బందీగా వ్యవహరించిన అధికారుల ు, సిబ్బందిని ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు. నాటి దర్యాప్తు అధికారులు వికారాబాద్ సీఐ టి.శ్రీను, వికారాబాద్ డీఎస్పీ బి.వి. సత్యనారాయణ, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెరాజ్ ఫిర్దోస్, ప్రస్తుత సీఐ కె.రఘు కుమార్, కోర్టు లైజనింగ్ ఎస్.నిరంజన్ గౌడ్, భరోసా సెంటర్ ప్రతినిధులు శ్వేత (ఎస్ఐ), కీర్తి ఆకుల(లీగల్ అడ్వైసర్) తదితరుల ను ఎస్పీ ప్రశంసించారు.

# ప్రచారం ముగిసింది ప్రతి ఫలం ముందుంది






### జిల్లా వ్యాప్తంగా తాయిలాలింపులు షురూ..

- ◆ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్, బిఆర్ఎస్
- ◆ 10 రోజులుగా ర్యాలీలు, పాదయాత్రల జాతర విమర్శలు, ప్రతి విమర్శల హోరు
- ◆ షాద్‌నగర్ కాంగ్రెస్ ప్రచార రథ సారథిగా ఎమ్మెల్యే శంకర్
- ◆ బిఆర్ఎస్‌లో భరోసా నింపిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య

**షాద్‌నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రచార పర్వం ముగిసింది.. ప్రతి'ఫలం' కోసం ఎదురుచూసే సమయం ఆసన్నమైంది. ఓటర్ల తీర్పు అభ్యర్థుల తల రాతలో ఎలాంటి మార్పులు తెస్తుందో అన్న ఉత్కంఠ ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సోమవారం సాయంత్రం ఐదు గంటలకల్లా అన్ని పార్టీలు ప్రచారానికి తెరదింపటంతో వార్డులలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.

నిత్యం ర్యాలీలు, ఇంటింటికి పాదయాత్రగా ఆయా పార్టీల అగ్రనేతలు మొదలు అనుచరగణం అంతా కలియతిరగడంతో షాద్‌నగర్ పట్టణంలో ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ గత రెండేళ్లలో తాము చేసిన అభివృద్ధి గురించి ప్రస్తావించగా, బిఆర్ఎస్ గతంలో తాము అందించిన సేవలు గురించి చెప్పుకుంది. ఇరు పార్టీలు నువ్వా నేనా అన్నట్లు వార్డుల్లో పాగా కోసం పోరాటం చేశాయి. కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నీ తానై ముందుకు నడిపించగా, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి వ్యూహాలలో కీలక పాత్ర పోషించారు. బిఆర్ఎస్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఆయన కుమారులు రవీందర్ యాదవ్, మురళి యాదవులు అభ్యర్థులను వెన్నంటి ఉండి ముందుకు నడిపించారు. గత 10 రోజులుగా అన్ని పార్టీల నేతలూ ఎన్నెన్నో వ్యూహాలతో వివిధ రూపాలతో ఓటర్ల వద్దకు వెళ్లారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు. అంతిమంగా తమకు అవకాశమిస్తే పట్టణ రూపురేఖలు మార్చేస్తామంటూ వాగ్దానాల వర్షం కురిపించారు. ఇక సిపిఎం, బిఎస్పి, భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు కూడా ప్రచారం చేశారు.

పోలింగ్ సమయానికి మరో 24 గంటలే ఉండటంతో తెరవెనక ప్రయత్నాలు ఊపందుకున్నాయి. వార్డులలో పెద్ద ఎత్తున మద్యం పంపిణీ, కానుకలు, నగదు పంపిణీ వంటి ప్రలోభాలను అరికట్టేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నా.. వారి కన్నుకప్పి ఓటర్లను ఆకర్షించేందుకు శతవిధాల పాకులాడుతున్నారు. అన్ని వార్డుల్లోనూ ప్రధాన పార్టీలు తాయిలాలు దండిగా పంపిణీ చేయటానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 28 వార్డులకు సంబంధించి 75 పోలింగ్ స్టేషన్లు ఉండగా 300 మంది సిబ్బంది ఆయా పోలింగ్ స్టేషన్లలో పని చేయనున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 200 మంది పోలీసులు రంగంలోకి దిగుతున్నారు. వందమంది డివిజన్ పరిధిలో ఉండగా మరో వంద మందిని ఇతర ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. సమస్యాత్మక వార్డులుగా గుర్తించి ఆరు వార్డులపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారు. దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించిన, గతంలో సర్పంచి ఎన్నికల్లో ఓటు వినియోగించుకొని ఇప్పుడు కౌన్సిలర్‌కు ఓటు వేసిన చర్యలు తప్పవని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

మొత్తానికి ఎన్నికలను ప్రశాంతంగా ముగించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# మూగబోయిన మైకులు

### వార్డుల వారీ లెక్క తేల్చే పనిలో ప్రధాన నేతలు
### గెలుపు ధీమాలో కాంగ్రెస్, బిఆర్ఎస్
### కొన్ని వార్డుల్లో చుక్కలు చూపించిన బిజెపి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మూడు మున్సిపాల్టీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నిలకల ప్రచారం సోమవారం సాయంత్రం 5గంటలతో ముగిసింది. ఆ తరువాత వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు అందరు కూడ తమ ప్రచారాన్ని ముగించారు. సౌండ్ స్పీకర్లు మూగబోయి, వివిధ రకాల ప్రచారానికి తెరపడింది. ఇక పోటీలో ఉన్న అభ్యర్థులు వ్యక్తిగతంగ ప్రతి ఇంటికి ఓటర్ల వద్దకు వెళ్లి తమను గెలిపించాలని కోరుతూ కలిసి ఆశీస్సులు అందుకోనున్నారు. ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీల ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల అభ్యర్థులతో పాటు కొన్ని వార్డుల్లో జనసేన, బిఎస్పి, టి.ఆర్.పి, పలువురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు గట్టి పోటీ నెలకొంది. కొన్ని వార్డుల్లో బిజెపి అభ్యర్థులు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. ఎక్కువ వార్డుల్లో తామే గెలుస్తామని కాంగ్రెస్, బిఆర్ఎస్ ధీమాలో ఉన్నాయి..అయితే కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులు ఓటర్లను డబ్బులు, మద్యం ఎరచూపుతూ మభ్య పెడుతూ గెలవాలని చూస్తున్నారని బిజెపి ఆరోపిస్తోంది.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఛీప్‌విప్ పి.మహేందర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్, రాష్ట్ర నాయకులు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, నక్కా ప్రభాకర్‌గౌడ్, పి.మహిపాల్‌రెడ్డిలు ప్రచారంలో పాల్గొనటంతో ఆపార్టీ క్యాడర్‌లో భరోసా నింపింది. బిఆర్ఎస్ మిగతా 2లో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

### ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో
# తొమ్మిది మావే

### మున్సిపాల్టీ ఫలితాలపై చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి
### కాంగ్రెస్ గెలుపునకు సంక్షేమ పథకాలు దోహదమవుతాయని ధీమా

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని తొమ్మిది మున్సిపాల్టీలను కాంగ్రెస్ గెలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ఛీప్ విప్ పి.మహేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్‌లో విలేకరుల మిగతా 2లో

# రేపే పోలింగ్

### వికారాబాద్ జిల్లాలో 261 పోలింగ్ కేంద్రాలు
### అతి సున్నితమైన కేంద్రాలు 74
### 313 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు
### 313 మంది ఎపివోలు, 940 మంది ఇతరులు

**వికారాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మున్సిపల్ పోలింగ్ మరో 24 గంటల్లో మొదలు కానుంది. ఈ నెల 11న జరిగే పోలింగ్‌కు అన్ని మున్సిపాల్టీల్లోనూ అధికారులు రంగం సిద్ధం చేశారు. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కోడంగల్ మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. వికారాబాద్‌లోని 34 వార్డుల్లో 58,013 మంది ఓటర్లు ఉండగా. 81 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. తాండూరు- 36 వార్డుల్లో 77,029 మంది ఓటర్లకు గాను 117 పోలింగ్ స్టేషన్లు, పరిగి- 12 వార్డుల్లో 14,622 ఓటర్లకు గాను 38 పోలింగ్ స్టేషన్లు, కోడంగల్ - 12 వార్డుల్లో 11,565 ఓటర్లకు గాను 25 పోలింగ్ స్టేషన్లు అధికారులు ఏర్పాటు చేశారు. నాలుగు మున్సిపాలిటీలోలోని 100 వార్డులకు గాను 261 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 74 అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలుగా, 53 సున్నితమైన పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి 313 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 313 అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 940 అదర్ ప్రిసైడింగ్ ఆఫీసర్లను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారులు తెలిపారు. వీరితో పాటు 30 మంది జోనల్ ఆఫీసర్లు, 8 ఫ్లైయింగ్ స్కాడ్ టీం, 8 స్పెషల్ స్కాడ్ టీం, 58 మంది మైక్రో అబ్జర్వర్లు నియమించినట్లు అధికారులు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్‌కు సరిపడా పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరిగేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.



పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతూన్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

### విధులకు డుమ్మా కొడితే
# కఠిన చర్యలు

### కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరిక

**రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి9, ప్రభాతవార్త:** ఉద్యోగులు ఎన్నికల విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సి. నారాయణరెడ్డి హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి సంబంధించిన మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం సాధారణ పరిశీలకులు మాయాంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ పూర్తయ్యింది. జిల్లాలో ఎన్నికలు జరగనున్న ఆరు మున్సిపాలిటీలకు సంబంధించి పోలింగ్ విధులు నిర్వహించేందుకు అవసరమైన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్ను ఈ మూడవ విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల విధులకు ఎవరైనా గైర్హాజరైతే ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు సిబ్బంది అందరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో డిపిఓ సురేష్ మోహన్, జిఎం డిఐసి శ్రీలక్ష్మి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులు మద్యం బంద్ : సిపి సుధీర్ బాబు



**రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ముందు రోజు సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయించనున్నట్లు ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు సోమవారం ఒక ప్రకటనలు తెలిపారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోని చేవెళ్ల, అమన్‌గల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మున్సిపాలిటీలో ఎన్నికలు జరుగుతున్నందున మద్యం దుకాణాలు, బార్, రెస్టారెంట్లు మూసివేయనున్నట్లు తెలిపారు.కౌంటింగ్ రోజు 13న ఉదయం నుంచి సాయంత్రం వరకు మూసి ఉంటాయన్నారు. ఎక్కడైనా మద్యం దుకాణాలు తెరిచి మద్యం అమ్మితే చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రశాం తంగా జరిగేలా చర్యలు తీసు కుంటున్నట్లు చెప్పారు. సోమవారం ఐదు గంటలకు ప్రచారం ముగియడంతో అధికారులకు పలు సూచనలు సూచించారు.



తీర్మాన ప్రతిని చూపిస్తున్న సర్పంచ్

### అవుసుపల్లిలో
# మద్య నిషేధం..
### నిబంధనలు ఉల్లంఘిస్తే 10 వేల జరిమానా..!

**ధారూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ధారూర్ మండల పరిధిలోని ఆవుసుపల్లి గ్రామం ఆదర్శవంతమైన నిర్ణయంతో వార్తల్లో నిలిచింది. గ్రామంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానించింది. గ్రామ సర్పంచ్ మహేష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులందరూ సమావేశమై ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ నిషేధానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ఎవరైనా అమ్మితే పదివేల రూపాయలు జరిమానా విధిస్తామని అన్నారు.

మద్యం గొడవలకు దారితీస్తుందని అందుకే గ్రామంలో అందరూ కలిసికట్టువి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

### ధారూర్ అడవుల్లో
# ప్లాంటేషన్ ధ్వంసం

### మొక్కలు తొక్కుకుంటూ ట్రాక్టర్ల కోసం దారి ఏర్పాటు
### ఇసుక మాఫియా దందాపై నోరు మెదపని అటవీ శాఖ

**ధారూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** అడవిని కాపాడాల్సిన వారే దారి ఇస్తే.. అక్రమార్కులకు అడ్డు అదుపు ఏముంటుంది. ధారూర్ మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఇసుక మాఫియా ఆగడాలు పరాకాష్టకు చేరాయి. ప్రభుత్వ నిబంధనల ు, అటవీ చట్టాల ు తుంగలో తొక్కి యథేచ్ఛగా ఇసుక ు తరలిస్తున్నారు. విస్తుపోయే విషయం ఏమిటంటే, సాక్షాత్తూ అటవీశాఖ అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి పెంచిన ప్లాంటేషన్ (మొక్కల పెంపకం) మధ్య నుంచే ట్రాక్టర్ల కోసం దారి వేసుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఇసుక ు దోచేస్తూ....**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అవె న్యూ ప్లాంటేషన్‌ల ు చేపట్టింది. కానీ, ఇక్కడ ఇసుకాసురుల ధాటికి ఆ మొక్కలు నేలమట్టం అవుతున్నాయి. ట్రాక్టర్లు వెళ్లడానికి అడ్డంగా ఉన్న చెట్ల ు తొలగించి, ప్లాంటేషన్ గుండా రహదారిని నిర్మించుకున్నా అటవీ అధికారులు అటువైపు కన్నెత్తు చూడకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల కనుసన్నల్లోనే..**

ఈ అక్రమ రవాణా అంతా అటవీశాఖ అధికారుల క ునసన్నల్లోనే సాగుతోందని స్థానికులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. మామూళ్ల మత్తులో ఉన్న అధికారులు, అడవిని దోచుకుంటున్న మాఫియాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ప్రకృతిని ధ్వంసం చేస్తున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వె నుక ఉన్న మతలబు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అక్రమ రహదారులకు ట్రెంచ్ (కందకాలు) తవ్వి ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ధారూర్ మండల ప్రజలు కోరుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అడవిని కాపాడాలని పలువురు కోరుతున్నారు.



అవె న్యూ ప్లాంటేషన్ లోంచి దారి ఏర్పాటు చేసుకున్న ఇసుక మాఫియా

ఇసుక డంప్ చేసిన దృశ్యం

ధ్వంసమైన మొక్కలు

# ఉప్పెనలా జనసంద్రం.. ఉప్పొంగిన ఉత్సాహం

### ఆఖరి రోజూ కాంగ్రెస్ భారీ ర్యాలీ

**షాద్‌నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ఆకాశం చిల్లు పడిందేమో అన్నట్లు.. భూమి తల్లి ఈ నిండేమో అనుకునేట్లు షాద్ నగర్ మున్సిపాలిటీ నలుమూలలా ఉన్న కాంగ్రెస్ దండులు కదిలి ముందుకు రావడంతో రహదారులు జన సంద్రమయ్యాయి.. చూపర్లను ఆశ్చర్యానికి గురిచేశాయి.. కాంగ్రెస్ బలాన్ని, పలగాన్ని మిగతా 2లో



# తనిఖీలు ముమ్మరం

### ప్రలోభాలకు చెక్‌పెట్టేందుకు అధికారుల హైరానా
### పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీల్లో ఈ నెల 11న ఎన్నికలు (పోలింగ్) జరుగనున్నాయి. మేడ్చల్ జిల్లాలో మూడు మున్సిపాల్టీల్లో (ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లి) ఎన్నికల నిర్వాహణకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని ఎల్లంపేట్ మున్సిపాల్టీలో 24వార్డులు ఉండగ ఆయా వార్డులలో మొత్తం ఓటర్లు 22,581 మంది ఉన్నారు. అలియాబాద్ మున్సిపాల్టీలో 20వార్డులు ఉండగ వీటిలో 20,454మంది ఓటర్లు ఉన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో 24వార్డులు ఉండగా వీటిలో ఆయా వార్డుల్లో 22,831మంది ఓటర్లు ఉన్నారు. మూడు మున్సిపాల్టీల్లో మొత్తం ఓటర్లు 65,866మంది ఓటర్లు ఉండి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

జిల్లాలో మూడు మున్సిపాల్టీల్లో 68వార్డులు ఉండటంతో ప్రతి వార్డుకు సంబంధించి రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎల్లంపేట్‌లో 24వార్డులకు 48పోలింగ్ కేంద్రాలు, అలియాబాద్‌లోని 20వార్డులకు 40పోలింగ్ కేంద్రాలు, మూడుచింతలపల్లిలో 24వార్డులకు 48పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వాహణ కోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని సిద్ధం చేసింది. అయితే ఈ నెల 11వ తేదీన పోలింగ్ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగనుంది. ఆయా వార్డులలో పోలింగ్ సజావుగా, ప్రశాంతంగ జరగటానికి పోలీసు ఉన్నతాధికారులు కూడ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగియటంతో పోటీ చేస్తున్న అభ్యర్థులపై, ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండ నిఘా కొనసాగిస్తూ అధికార యంత్రాంగం తనిఖీలు ముమ్మరం చేసింది. డబ్బులు, మద్యం వంటివి తరలించకుండ చెక్‌పోస్టుల వద్ద, ప్రధాన చౌరస్తాల వద్ద పోలీసులు, స్క్వాడ్ అధికారులు ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నారు.




మోత్కుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు గ్రామస్థుల సమీక్ష సమావేశం మాట్లాడుతున్న మండల అభివృద్ధి అధికారి హేమంత్,

## ఆదర్శ గ్రామ పంచాయతీ అవార్డుల కోసం నివేదిక ఇస్తాం

**కోట్‌పల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో సోమవారం నాడు పంచాయతీ అధికారులు మరియు మండల అభివృద్ధి అధికారులు గ్రామంలో వీధుల్లో పర్యవేక్షణచేసి ఫొటోలు తీయడం జరిగింది. 2023,2024, ఫైనాన్స్ సంవత్సరంకుగాను గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించడం జరిగిందని ,అన్ని పనులు సక్రమంగా చేయడం జరిగిందని ,ఇందుకు గాను కోట్‌పల్లి మండలంలోని మోత్కుపల్లి గ్రామం అదర్శ గ్రామంగా కేంద్రానికి నివేదిక పంపించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో డిఎల్‌పిఒ సంధ్యారాణి, గ్రామ సర్పంచు బైండ్ల అమృతమ్మ నారాయణ, ఉప సర్పంచు మాధవరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్

**కుల్కచర్ల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ అన్నారు. సోమవారం మండలపరిధిలోని ఎత్తుకాల్వ తాండ, చెరువుముందలి తాండ (ఎ),ఇప్పాయిపల్లి, బిటి రోడ్డు పనులను స్థానిక సర్పంచులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా, ఎన్నో ప్రభుత్వాలు మారినా వెనుకబడిన గ్రామీణ ప్రజలు సమస్యలు మారలే కాని నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిగిరి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరువతో ఎన్నో ఏండ్ల కల సాకారమయిందని అన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతోనే గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో చెరువుముందలి తాండ సర్పంచ్ రవీందర్, నాయక్, ఇప్పాయిపల్లి సర్పంచ్ మల్లేష్,ఎత్తుకాల్వ తాండ సర్పంచ్ సీతారాం నాయక్,బిందేం గడ్డ తాండ సర్పంచ్ బాసు నాయక్,నాయకులు భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బిటి రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచులు

## వేగవంతంగా అభివృద్ధి పనులు

సర్పంచ్ వార్వల ఆంజిలయ్య

**కుల్కచర్ల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** గ్రామంలో వేగవంతంగా అభివృద్ది పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ వార్వల ఆంజిలయ్య, ఉప సర్పంచ్ విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పిఆర్ కార్యాలయానికి మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ గౌడ్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ది పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**యాచారం,ఫిబ్రవరి9, ప్రభాతవార్త:** విద్యార్థి దశలో ఉన్న ఆనందం మరెక్కడా లేదని పూర్వ విద్యార్థులు అన్నారు. యాచారం మండలపరిధిలోని నందివనపర్తి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల 1987-88 బ్యాచ్ సంబంధించిన పూర్వవిద్యార్థులు వారి ఆత్మీయసమ్మేళన కార్యక్రమం వైభావంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పూర్వ ఉపాధ్యాయులు నాగయ్య , చెన్నకేశవ రెడ్డి , తిరుమల చారీ, నారాయణ్ రెడ్డి హాజరైనారు. అప్పటి అటెండర్ అయినటువంటి సాలయ్య విచ్చేసి వారియొక్క పూర్వపు జ్ఞాపకాలను విద్యార్థులతో నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమానికి బ్యాచ్‌కి సంబంధించిన అందరూ పూర్వ విద్యార్థులు కూడా హాజరు అయి వారియొక్క పూర్వపు జ్ఞాపకాలు ఒకరితో ఒకరు మాట్లాడుకుని చాలా ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలొ వారి పూర్వ మహిళా విద్యార్థులు అందరు హాజరయ్యారు. విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తపరిచారు. అలాగే రాబోవు వజ్రోత్సవ సభకు కూడా వారి సహాయ సహకారాలు అందిస్తాము అని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని వందేమాతరంతో ప్రారంభించి జనగణమన తో ముగింపు చేసుకోవడం ఒక ప్రత్యేకత చాటారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

## పరిగి మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి విస్తృత ప్రచారం

**పరిగి టౌన్,ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బిజెపి జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్ రావు పాల్గొని బిజెపి నేతలతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం,ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో మున్సిపాలిటీలకు అందుతున్న నిధులు, వాటితో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ చైతన్య పరిచారు. సోమవారం ఆయన 11వ వార్డు అభ్యర్థి తుమ్మల రమేష్,17వ వార్డు అభ్యర్థి వార్ల సురేఖ గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఇంటింటా తిరిగి ఓటర్లను కలిసి పరిగి మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, రహదారులు,తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధం వంటి అంశాలపై బిజెపి కార్యాచరణను వివరించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## కొత్తూరులో పౌష్టికాహార పంపిణీ

- పిల్లలకు సోనూసూద్ సేవా సంస్థ సహాయం




**కొత్తూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

కొత్తూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న చిన్నారులకు సోనూసూద్ స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున, బైండ్ల శివ ఆధ్వర్యంలో డాబర్ ఇండియా సహకారంతో ఆరోగ్యం మరియు పౌష్టికాహారానికి అవసరమైన పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యం మెరుగుపడితేనే దేశ భవిష్యత్తు బలంగా ఉంటుందని, పౌష్టికాహారంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న పిల్లలకు ఇటువంటి సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో ఉత్సాహం పెరిగిందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో, కొండారెడ్డి సుమన్, బండారి శ్యామ్, కరోలా గణేష్, జోగురాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు బంద్

### ఫ్యూచర్ సిటీ సిపి సుధీర్ బాబు



**రంగారెడ్డి అర్బన్,ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ముందు రోజు సోమవారం సాయంత్రం ఐదుగంటల నుంచి బుధవారం సాయంత్రం ఐదుగంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయించనున్నట్లు ఫ్యూచర్ సిటీ కమీషనర్ సుధీర్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోని చేవెళ్ల, అమన్‌గల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, శంకర్‌పల్లి ,మొయినాబాద్ మున్సిపాలిటీలో ఎన్నికలు జరుగుతున్నందున మద్యం దుకాణాలు, బార్, రెస్టారెంట్లు మూసి వేయనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ రోజు 13న ఉదయం నుంచి సాయంత్రం వరకు మూసి ఉంటాయన్నారు. ఎక్కడైనా మద్యం దుకాణాలు తెరిచి మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సోమవారం ఐదుగంటలకు ప్రచారం ముగియడంతో అధికారులకు పలు సూచనలు సూచించారు.

## నేరాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి

షీటీం ఇంచార్జి నర్సింలు

**పూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పరిగి సబ్‌డివిజన్ షీటీం ఇంచార్జి నర్సింలు పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పి స్నేహమెహ్రా ఆదేశానుసారం సోమవారం చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌పరిధిలోని పూడూరు కేజిబివి పాఠశాలలో మహిళలపట్ల జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, బాల్య వివాహాలు చేయకూడదని, నిర్భయ, పిఒసిఎస్ చట్టాలగురించి వివరించారు. బ్యాంకింగ్, ఆన్‌లైన్ మోసాలు, 100 డయల్, షీటీం నెంబరు 181, సిసి కెమెరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, అక్రమరవాణా ,డ్రగ్స్, గంజాయి నిర్మూలన, మధ్యపానం నిషేదం వంటివాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఫాతిమా, షీటీం సభ్యులు సావిత్రి, శోభ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




పూడూరు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినీలకు అవగాహన కల్పిస్తున్న షీటీం ఇంచార్జి నర్సింలు తదితరులు



పూడూరు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

## కీచక టీచర్‌పై ఫోక్సో కేసు నమోదు

..విద్యార్థిని మెడలో తాళి కట్టిన ప్రైవేటు పాఠశాల టీచరు

..అన్నోజిగూడలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9,ప్రభాత వార్త:** పాఠశాల గదిలో పాఠాలు చెప్పి విద్యానేర్పాల్సిన ఓ గురువే ఓ విద్యార్థిని పట్ల కీచకుడీగామారి మాయమాటలతో నమ్మించి తాళి కట్టడంతో విషయం పోలీసులకు చేరడంతో సదరు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసునమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 20రోజుల క్రితమే జరిగిన సంఘటన వివరాలు ఇలాఉన్నాయి. పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ శ్రీ చైతన్య హైస్కూల్‌లో పఠ్రే మైటీన్ ( 27 ) ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. అదే స్కూల్‌లో టెన్త్‌క్లాస్ చదువుతున్న ఓ విద్యార్థినిపై కన్నేసిన టీచర్ విద్యాబుద్ధులు నేర్పాల్సిన చోట ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి లోబరుచుకుని ఎవరికి తెలియకుండా రహస్యంగా మెడలో తాళికట్టి పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. తనకు ఏమి తెలియదు అన్నట్లు విద్యార్థి రోజు మాదిరిగానే ఇంటికి వచ్చి స్కూల్‌కు వెళ్లుతోంది. ఓ రోజు విద్యార్థి మెడలో పసుపుతాడు చూసిన తల్లి కూతురిని నిలదీయగా టీచర్ తన మెడలో తాళికట్టి పెళ్లి చేసుకున్నట్లు తెలిపింది.

దీంతో తల్లితండ్రులు ఒక్కసారిగా షాక్‌కు గురైయ్యారు. తీవ్ర ఆందోళన చెందిన విద్యార్థిని తల్లితండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. దీంతో ప్రిన్సిపాల్ సదరు టీచర్‌ను పిలిచి ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఇటు బాధితురాలు తల్లితండ్రులు పాఠశాల యాజ మాన్యంపై ఒత్తిడి తెచ్చిన తమ తప్పుఏమిలేనట్లు ముక్తసరిగా సమాధానం ఇవ్వడంతో పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో పోలీసులు విచారణ జరిపి సదరు టీచర్‌పై ఫోక్సోచట్టం కింద కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ రాజువర్మ తెలిపారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

తిరుమలాపూర్ గ్రామంలో

29వ హనుమాన్ దేవాలయ వార్షికోత్సవం

**షాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** షాబాద్ మండల పరిధిలోని తిరుమలపూర్ గ్రామంలో సోమవారం 29వ హనుమాన్ దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా నాగుల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని బుచ్చి రెడ్డి మైపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భాస్కరయోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, గ్రామ హనుమాన్ దేవాలయం వార్షికోత్సవ సందర్భంగా నాగుల స్థాపన ఈ గ్రామంలో చేయటం గ్రామానికి శుభప్రదమని ప్రతి గ్రామంలో నాగుల ప్రతిష్టాపన చేసుకోవాలని నాగదేవతలను పూజించాలని సూచించారు.




ముదెంగుడ గ్రామసభలో మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య

## గ్రామ అభివృద్ధికి కృషి

సంకేపల్లి గూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య

**షాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** గ్రామంలో ప్రజల కనుగుణంగా మౌలికవసతులు ఏర్పాటు చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంకేపల్లి గూడ గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య అన్నారు. షాబాద్ మండల పరిధిలోని సంకపల్లి గూడ గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రజలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పూర్తి చేసి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మాజీసైనికుల సమస్యల పరిష్కారానికి సమావేశం

**రంగారెడ్డి అర్బన్,ఫిబ్రవరి9,ప్రభాతవార్త:** మాజీ సైనికుల పెన్షన్ తదితర సమస్యల పరిష్కారానికి ఆర్మీ విభాగానికి చెందిన అధికారులు ఈనెల 11న ఉదయం 11గంటలకు హైదరాబాద్ సోమాజీగూడాలోని ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి తెలిపారు. ఈ సందర్భంగా మాజీసైనికులు ఎదుర్కొంటున్న పెన్షన్ సమస్యలు, సేవా సంబంధిత ఇతర ఇబ్బందులను ప్రత్యక్షంగా వినిపించి పరిష్కారం పొందే అవకాశాన్ని కల్పించనున్నట్లు శ్రీనేష్ కుమార్ నోరి తెలిపారు .సమస్యలు ఉన్న మాజీసైనికులు తప్పనిసరిగా సమావేశానికి హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రతిష్టాత్మకంగా ప్రీ ప్రైమరి విద్య

**జిల్లెడు చౌదరిగూడ,ఫిబ్రవరి 9,(ప్రభాతవార్త):** ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం ప్రీ ప్రైమరి విద్యాను నిర్వహిస్తుందని ఎంఈఓ కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం పంపిణీ చేసిన ఫర్నిచర్ ,లెర్నింగ్ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుండి ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే ఈ లెర్నింగ్ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. దీంతో ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో కూడా ప్రైమరీ ఎడ్యుకేషన్ అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోడంపాటి శ్వేత చంద్రబాబుగౌడ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నినీలా మోహన్ నాయక్ నరేందర్, ఉపసర్పంచ్ హజార్ అలీ, వార్డు మెంబర్లు , ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శివలింగమ్మ, మహేష్, చందర్ నాయక్, మాలతి, హరిత, కవిత, ముబీనా, తదితరులు పాల్గొన్నారు .



పాఠశాలకు ఫర్నిచర్ అందజేస్తున్న ఎంఈఓ కిరణ్‌కుమార్ రెడ్డి

## అందరికీ మంచి జరగాలి..!

సర్పంచ్ గబ్రు చౌహాన్ దంపతులు



**నందిగామ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** నందిగామ మండలం సిడి తాండ గ్రామపంచాయతీ సర్పంచ్ గబ్రు చౌహాన్ దేవి సోమవారం తమ స్వగృహంలో ప్రత్యేక పూజలు చేశారు. తమ వివాహమై 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా తమ ఇంట్లో పూజలు చేశారు. అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అనే సంకల్పంతో ప్రజలందరికీ మంచి జరిగేలా చూడమని భగవంతుని వేడుకున్నారు. ఈ పూజల్లో ఉప సర్పంచ్ రవీందర్ నాయక్ ,వార్డు సభ్యులు జటావత్ రాజేష్, మాధవి , శాంతి శ్రీనివాస్, మండల ఎస్టి సెల్ అధ్యక్ష ఎస్టి, వార్డ్ మెంబర్ శ్రీను నాయక్, బుజ్జి , మెగావత నాగేష్, మెగావత్ పత్తి, కాంగ్రెస్ నేతలు తులసి రామ్, పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** విద్యుత్ డిసిడబ్ల్యు పనులు, కరెంట్ తీగల కింద చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ విద్యుత్ ఏఈ బి.యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11 కెవి చందుపట్లగూడ ఫీడర్ పరిధిలోని ఎదులాబాద్, చందుపట్లగూడ, మర్రిపల్లిగూడ, పోతరాజుగూడలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11 కెవి శివారెడ్డిగూడ ఫీడర్ పరిధిలోని శివారెడ్డిగూడ, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్, జిహెచ్‌ఎంసి, ఘణాపూర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఈ సూచించారు.



పెద్దేముల్‌లో బోరు వేయిస్తున్న సర్పంచ్. ఉపసర్పంచ్

## గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి

..సర్పంచ్ డివై నర్సిములు

**పెద్దేముల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే తమ ప్రధాన ధ్యేయమని సర్పంచ్ డివై నర్సిములు అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని 9వ 10వ,11వ వార్డులలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడటంతో సోమవారం సర్పంచ్, ఉప సర్పంచ్‌తో, వార్డు మెంబర్లతో కలిసి బోరు వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డివై నర్సిములు మాట్లాడుతూ పెద్దేముల్‌లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు గ్రామ వీధులలో పర్యవేక్షించి సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు. అభివృద్ధి, ప్రజాసంక్షేమమేతమ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నామని అన్నారు. తాగునీటిని వృథా చేయకుండా నల్లాలకు ఆన్ ఆఫ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసామని అన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు గ్రామస్థులు సహకరించి, గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాలప్ప, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, వార్డు మెంబర్లు అంజి, వెంకట్, అనురాధ రమేష్, మల్లప్ప, రవి, నయ్యుం, కారోబార్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్తుంకర్ శివాజీకీ మహాత్మాగాంధీ నేషనల్ అవార్డు ప్రధానం

**కేశంపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ప్రజాసేవకు గుర్తింపుగా అవార్డు రావడం ఆనందదాయకంగా ఉందని బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తుంకర్ శివాజీ అన్నారు. కరోనా కష్టకాలంలో నిరుపేదలకు నిత్యా వసరాల సరుకుల పంపిణీ మరియు సామాజిక సేవలను గుర్తించి పర్యావరణం పరిరక్షణకు కృషికి గాను సోమవారం రవీంద్ర భారతి ఆడి టోరియంలో సినీనటుడు పసునూరి శ్రీనివాసు సినీ గాయకులు నల్గొం డ గద్దర్ నర్సన్న గార్ల చేతుల మీదుగా శివాజీని శాలువాతో సత్కరించి అవార్డు ప్రధానం చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ మనకు ఉన్న దాంట్లో కొంత మేరకు సేవా కార్యక్రమాలు చేయడం చాలా ఆనందనిస్తాయి కాబట్టి నేను చేసిన సేవా కార్యక్రమలు గుర్తించి సత్కరించి అవార్డు అందజేసిన టి ఆర్ వి ఎస్ సంస్థ వారికి సినీనటుడు పసునూరి శ్రీనివాసుకు సినీగాయకులు నల్గొండ గద్దర్ నర్సన్నకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి. పాండురంగరెడ్డి. శివశంకర్. మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న మల్తుంకర్ శివాజీ

## ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

**కేశంపేట, జనవరి 9, ప్రభాతవార్త :** మక్క పంటకు నీళ్లు పెడుతూ ప్రమాదవశాత్తు ఒడ్డు పైనుండి జారిపడి ఊపిరాడక వ్యక్తి మృతి చెందిన ఘటన కేశంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం కేశంపేట మండల కేంద్రానికి చెందిన ఢిల్లీ శేఖర్ (45 సంవత్సరాలు )(కులం ముదిరాజ్ )కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన మఠం శేఖర్ వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి ఒడ్డుపై ఉండి కాలు జారిపడి మక్కా చేన్లో మృతి చెందాడు. శేఖర్ మృతిపై ఎలాంటి అనుమానంలో లేవని మృతుడు సోదరుడైనసత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయాలలో ర్యాంపులు, వీల్‌చైర్స్ ఏర్పాటు చేయాలి

- వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు బొడ్డు శంకర్

**మాడ్గుల, ఫిబ్రవరి9, ప్రభాతవార్త:** మాడ్గులమండలంలోని తహసిల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలలో ర్యాంపులు, వీల్‌చైర్స్ ఏర్పాటు చేయాలని వికలాంగుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొడ్డు శంకర్ కోరారు. సోమవారం మాడ్గులలో విలేకర్లతో మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు తమ అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినప్పుడు ర్యాంపులు, వీల్‌చైర్స్ సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యాలయాల్లోని వివిధ విభాగాలకు వెళ్లేందుకు అవరోధాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మాడ్గుల మండలంలోని తహసిల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు ఏర్పాటు చేసి, వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం మండల అధ్యక్షులు యాచారం సత్యనారాయణ గౌడ్, కార్యదర్శి ఎమ్మె గణేష్ పాల్గొన్నారు.

## కొత్తపల్లి, మొగుళ్లవంపు, యాచారంలో విద్యుత్ అంతరాయం

**యాచారం,ఫిబ్రవరి9, ప్రభాతవార్త:** విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ ఏఈ సందీప్ ప్రకటనలో తెలుపుతూ.. చెట్ల కొమ్మలు, ఇతర తీగలను తొలగించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మొగుళ్ళవంపులో మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 6 వరకు రైతులు, కొత్తపల్లిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, యాచారంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. చిన్న పరిశ్రమలవారు, రైతులు, వ్యాపారులు, విద్యుత్ అంతరాయాన్ని అర్థం చేసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలన్నారు.



ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థులు

## ఫీల్డ్ ట్రిప్‌కు వెళ్లిన విద్యార్థులు

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండలంలోని గుండెపల్లి గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులు సోమవారంరోజు ఫీల్డ్ ట్రిప్‌కు వెళ్లారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా విద్యార్థులు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను నిశితంగా పరిశీలించారు. అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను అధికారులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ,మాజీ ఎమ్మెల్యే

# ఇద్దరూ.. ఒకటై

### మున్సిపాలిటీ ఎన్నికల్లో వీర్లపల్లి, చౌలపల్లి చక్రవ్యూహం

### ప్రత్యర్థుల అంచనాలకు అందని రీతిలో ముందడుగు..

### చైర్మన్ స్థానం ఇక లాంచనమేనా..?

**షాద్‌నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** అధికారంలోకి అడుగుపెట్టి రెండేళ్లు.. సేవకులుగా తమదైన ముద్రవేశారు.. నిత్యం వార్డుల్లో, లేదా గ్రామాల్లో సంచారం.. ప్రజలకు స్నేహితులై నిలిచారు.. మొన్న సైనికుల్లా వ్యవహరించి అత్యధిక సర్పంచులను గెలిచారు.. ఈరోజు మరోసారి వారే ఒక సైన్యంగా మారి తమ అభ్యర్థులను ముందుకు నడిపిస్తున్నారు.. ఎవరి అంచనాలకు అందని వ్యూహాలతో ఒక చక్ర వ్యూహాన్ని నిర్మించి ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారు. చైర్మన్ స్థానం ఇక కాంగ్రెస్ పార్టీకి లాంచనమే అనుకునే రీతిలో ప్రతి వార్డు పై దృష్టి పెట్టి అభ్యర్థులను విజయం వైపు నడిపిస్తున్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి కలయికలో విజయం వైపు అడుగులు ఇవి. ఏ సమస్యను భుజానికి ఎత్తుకున్న దానిని అనుకున్న రీతిలో విజయవంతం చేయడంలో రాజీలేని పోరాటం చేసే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలు మరోసారి మున్సిపాలిటీలో తమ ప్రభావాన్ని నిలుపుకునేందుకు ముందడుగు వేశారు. ఈ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష ్యంగా ముందుకు సాగుతున్నారు. ఒక్కసారి మున్సిపాలిటీ ఎన్నికల చిత్రాన్ని పరిశీలిస్తే..

**సరిలేరు మీకెవ్వరు..**

సరిలేరు మీకెవ్వరు అన్న రీతిలో గత రెండేళ్లుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అడుగులు సాగుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే రాబోయే సర్పంచ్, కౌన్సిలర్ ఎన్నికలను ఎలా ఢీకొట్టాలో ముందే ఒక అంచనాకు వచ్చారు. ఈ క్రమంలోనే భారీగా నిధులు తెచ్చి అటు గ్రామాలను, ఇటు మున్సిపాలిటీని అభివృద్ధి చేయడంలో మునిగిపోయారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మంచి ఫలితాలు ఇచ్చింది. 80 కి పైగా సర్పంచ్ స్థానాలను సాధించి సత్తా చాటారు. మున్సిపాలిటీ విషయానికొస్తే వార్డుల వారీగా నాయకులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి, సమస్యలను సేకరించి పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేయడం మొదలుపెట్టారు. అలా కోట్ల రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట అంతర్గత కాలువలు నిర్మించడం, విద్యుత్ సమస్యలు గుర్తించి పరిష్కరించడం, తాగునీటి అవసరాలు తీర్చడం వార్డుల వారీగా ఉండే ఇలాంటి సమస్యలను తీర్చడమే కాకుండా, గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిన పాత జాతీయ రహదారి విస్తరణ, వంద పడకల ఆసుపత్రి పునరుద్ధరణ, కళాక్షేత్రం నిర్మాణానికి నిధులు.. ఇలాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి అనుభవం చాలా భోజనం చేకూర్చుతుంది. ఈ కారణంగానే ఏ వార్డుకు ప్రచారానికి వెళ్లిన ప్రజల నుంచి నిలదీతలు గాని, అసంతృప్తి గాని కనిపించడం లేదు. ప్రతి ఒక్కరూ విపరీతంగా ఆదరిస్తూ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తామని హామీలు ఇస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలకు హారతులు పడుతున్నారు. అలా తొలి వ్యూహాన్ని విజయవంతం చేసి కౌన్సిలర్ ఎన్నికల ప్రయాణంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా కాపు కాశారు.

**ఆటా మాదే.. వేటా మాదే..**

సామాన్యంగా బి ఫామ్ లు ఇచ్చే వరకు మాత్రమే ఎమ్మెల్యేలు సీన్లో ఉంటారు. ఆ తర్వాత గెలుపు భారాన్ని అభ్యర్థుల మీదే వదిలేస్తారు. మా అంటే అక్కడక్కడ ప్రచారానికి వస్తారు. ఇప్పటిదాకా చూసింది ఇదే.. కానీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిల తీరే వేరు. ఈ ఎన్నికల్లో ఆటా మాదే.. వేటా మాదే.. అన్న రీతిలో వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. ఎన్నికల క్రమంలోనే 28 వార్డులలో గెలుపుకు అవకాశాలు ఉన్న అభ్యర్థులను గుర్తించి వారికి మాత్రమే టికెట్లు కేటాయించారు. అక్కడితో ఆగలేదు ఏ వార్డులో కూడా రెబల్స్ బెడద లేకుండా అందర్నీ సమన్వయపరిచి అభ్యర్థికి మద్దతు ఇచ్చేలా ముందుకు నడిపారు. తరువాత వార్డులలో పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవతలి పార్టీలు బలమైన అభ్యర్థులను పెట్టిన చోట ప్రత్యేక దృష్టి పెట్టి ఆయా వార్డుల్లో కీలకమైన వ్యక్తులను పార్టీ వైపుకు మళ్లించి 40 మార్కులతో ఉన్నవారిని 60 మార్కుల దాకా తీసుకువచ్చి చక్రం తిప్పారు. అవతలి పార్టీలో గెలుపుకు అవకాశాలు ఉన్న వారు కూడా ఎమ్మెల్యే చక్రవ్యూహంలో చిక్కుకొని వెనక్కి వెళ్లిపోయే పరిస్థితి చాలా వార్డుల్లో నెలకొంది. తొలివిడత సర్వేలో 16 సీట్లు కాంగ్రెస్ కు ఖాయం అన్న పరిస్థితి నుంచి ప్రస్తుతం ఆ సంఖ్య 20ని దాటేలా చేశారు. ఎన్నికలకు ఇంకా రెండు రోజుల గడువు ఉంది. ఈ లోపు ఇంకా ఎన్ని మలుపులు ఉంటాయో, ఎన్ని వార్డులు గెలుపు వైపు నడుస్తాయో తెలియదు. సర్వేలన్నీ ప్రస్తుతం అధికార పార్టీకే అనుకూలంగా ఉన్నాయి. ఇది కేవలం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల వ్యూహంతో ముందుకు సాగడం వల్ల కనిపిస్తున్న మార్పు.. ఇది అక్షర సత్యమని నిరూపించబోతోంది రేపటి మున్సిపాలిటీ ప్రజల తీర్పు..కృష్ణార్జునుల్లా వీర్లపల్లి శంకర్, చౌలపల్లి ప్రతాప్ రెడ్డిల కలయికలు మరో పోరాటానికి సక్సెస్ఫుల్ కాంబినేషన్ అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

## అందెమోహన్‌కు అద్భుత విజయాన్ని ఇవ్వండి..

### రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**షాద్‌నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** వార్డుల వారీగా అభివృద్ధి చేసి పట్టణాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. షాద్ నగర్ పట్టణంలో 14వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అందెమోహన్ తరఫున ఆయన ప్రచారానికి వచ్చారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అక్కడికి జనం తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీకి జయ జయ ధ్వానాలతో ఆ ప్రాంతం మారు మ్రోగింది. జనం కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి జేజేలు కొట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అందెమోహన్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం.. సిరిసిల్ల రాజయ్య కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. 14వ వార్డులో ప్రచారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలోనైనా, వర్తమానంలోనైనా గ్రామీణ ప్రాంతాలను, పట్టణ ప్రాంతాలను అభివృద్ధి చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పలు సమస్యలు ఏర్పడ్డాయని, కాంగ్రెస్ పార్టీ క్రమంగా పరిస్థితిని చక్కదిద్దుతూ వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి అన్ని వార్డులలో ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

# అదిరిందయ్యా బస్వం

### జోరుగా ఇంటింటి ప్రచారం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** అగ్గనూరు వంశం పేరును నిలబెడుతూ రాజకీయంగా మరో అడుగు ముందుకు వేశాడు.. కౌన్సిలర్ గా గెలిచేందుకు వార్డు అభ్యర్థిగా రంగంలోకి దిగాడు.. కాంగ్రెస్ అభయ"హస్తం".. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అండదండలు.. సోదరుడు అగ్గనూరు విశ్వం సహకారంతో విజయం దిశగా దూసుకుపోతున్నాడు. షాద్ నగర్ పట్టణంలోని 23వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అగ్గనూరు బస్వం ప్రయాణమిది. కాంగ్రెస్ తరఫున రంగంలోకి దిగిన బస్వం క్రమక్రమంగా ఉంచుకుంటూ ముందుకు సాగుతున్నాడు. వార్డు పరిధిలోని వీరశైవ సమాజం సభ్యులతో పాటు, వ్యాపారులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున సహకరించడంతో దిగ్విజయవంతంగా ముందుకు సాగుతున్నాడు. వార్డు ప్రజలు కూడా అతని పట్ల ఆదరణ కనబరుస్తుండడం విశేషం.


అగ్గనూరు బస్వం

**అవకాశం ఇస్తే అభివృద్ధి.. అగ్గనూరు బస్వం**

తనకు అవకాశం కల్పిస్తే 23వ వార్డు ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి అగ్గనూరు బస్వం అన్నారు. ఇంకేంటి ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో వార్డుల అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతుందని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గతంలో రహదారులు వేయించామని అన్నారు. భవిష్యత్తులో కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడం జరుగుతుందని వెల్లడించారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

### గ్రామస్తుల సహకారంతో..

# క్రీడలదుస్తులు,పాదరక్షలు అందజేత

**దోమ,ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** గ్రామములోని పాఠశాల విద్యార్థులు చక్కగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తెస్తారని గ్రామస్తులు పాఠశాలకు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యము లేకుండా వస్తువులు అందించారు.వివరాల్లోకి వెళ్ళితే మండల పరిధిలోని మల్లేపల్లి తాండాకుచెందిన గ్రామస్తులు అందరూ కలిసి సోమవారంనాడు గ్రామములో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడాదుస్తులు,అందజేశారు.మంగమ్మ తెల్ల యూనిఫారం ,ప్రశాంత్ పాదరక్షలు అందజేశారు.పాఠశాలకు దుస్తులు అందజేయడంతో మండల విద్యాధికారి వెంకట్ వారిని అభినందించారు.ఈ కర్యక్రమములో గ్రామ సర్పంచ్ సుగుణమ్మ శ్రీనివాస్,ఉపసర్పంచ్ సునీతాశ్రీనివాస్,చైర్మెన్‌లు,మమత, బుగ్గయ్యమల్లమ్మ,దాదాపూర్ పాఠశాల కాంప్లెక్స్ఎచ్ఎం అమర్నాథ్,పిఆర్‌టియు మండల అద్యక్షులు కేశవులు,సిఆర్‌పి రఘు,అంగన్‌వాడి సిబ్బందిబుజ్జమ్మ,గ్రామస్తులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న గ్రామస్తులు

# కొనసాగుతున్న న్యాయవాదుల ధర్నా..

**చేవెళ్ల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వెంటనే అమలు చేయాలనే డిమాండ్ చేస్తూ న్యాయవాదులు చేస్తున్న ధర్నా కొనసాగుతుంది. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ యాక్ట్ అమల్లోకి వచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తు కార్యాచరణ మొదలు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు సునీల్ , అనంతసేన్ రెడ్డి , శంషుద్దీన్ , ఆకుల మహేష్ కుమార్ , అనిల్ కిరణ్ కుమార్, కొండల్ రెడ్డి , విష్ణువర్ధన్ రెడ్డి , రంగనాథ్ , పులిగారి గోవర్ధన్ రెడ్డి, పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న న్యాయవాదులు

# ఆర్ఓబి పూర్తి చేయాలని ఆందోళనలు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన పూర్తి చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్నాయి. మహిళలు, యువకులు నిరసన ర్యాలీలు నిర్వహించగా సీనియర్ సిటిజన్‌లు కూడా నిరసనగా దిగేందుకు సిద్ధమవుతున్నారు. గత 13 ఏళ్లుగా నత్తనడకన కొనసాగుతున్న రైల్వేవంతెన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ యువత నిరాహారదీక్ష చేపట్టింది. వంతెన పూర్తి చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల ర్యాలీ నిర్వహించి, ఘట్‌కేసర్ సర్కిల్ డీసీ వాణికి వినతిపత్రం అందజేశారు. వంతెన కోసం చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా యువకులు నిరాహారదీక్షకు దిగారు. వంతెన ర్యాంప్ ప్రారంభమైన స్థలంలో టెంటు వేసుకొని నల్లచొక్కాలు ధరించి నిరసన దీక్ష నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వంతెన నిర్మాణం పూర్తి చేయాలని నినదించారు. ప్రభుత్వాలు మారినా వంతెన పూర్తి కాలేదని అధికారులు, ప్రజాప్రతినిధులు 13 ఏళ్లుగా ఏమి సాధించారని గొప్పలు చెప్పుకుంటున్నారని యువకులు ప్రశ్నించారు. బాధితులకు పరిహారం సరిగా ఇవ్వడం లేదని, వంతెన పనులు ఆలస్యం చేస్తున్నా రెండు ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురాలేదని, అందుకే తామే ఆందోళనతో కార్యాచరణను అమలు చేస్తున్నామని వారు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా యువకులు ఏకమై నిరాహారదీక్ష చేస్తున్నారని ఏపార్టీ నాయకుల మద్దతు లేదని వారు స్పష్టం చేశారు. వంతెన పూర్తి చేసేవరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయని ఘట్‌కేసర్ ప్రజల సహకరించాలని యువజన నేతలు కోరారు. ఈసందర్భంగా వంతెన నిర్మాణంపై జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ కళాకారులు ఆటపాట రూపంలో అందరిని చైతన్య పరిచారు. ఒకవైపు వంతెన శ్లాబ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా మరో వైపు వంతెన సాధన, పోరాటం, నిర్మాణం వేగవంతం చేయాలంటూ ఆందోళనలు నిర్వహిస్తుండటం గమనార్హం.


ఘట్‌కేసర్‌లో సాముహిక నిరాహారదీక్షలో పాల్గొన్న యువకులు

# ప్రమాదకరంగా మారిన బావులను పూడ్చివేయండి


ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న బావి


ఎన్ఎఫ్‌సీనగర్ సీ2లో పాడుబడ్డ బావిలో చెత్తవేసిన దృశ్యం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** జీహెచ్ఎంసి ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని పాడుబడ్డ బావులు ప్రమాదకరంగా మారాయి. కాలనీలోని సీ2 వద్ద రెండుచోట్ల బావులు నిరుపయోగంగా ఉండటంతో స్థానికులు చెత్త చెదారం వేయగా అపరిశుభ్రత నెలకొంది. బావి నిండిపోయి ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటురోగాలు సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఎఫ్‌సీ సొసైటీ ఏర్పడిన సమయంలో వ్యవసాయబావుల నీటిని వినియోగించారని కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. బావి చుట్టూ సొసైటీ రక్షణ గోడ నిర్మించి ఇనుప జాలిని ఏర్పాటు చేసినప్పటికి ప్రజలు బావిలో చెత్త వేస్తున్నారని, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. బావి నీరు పూర్తిగా కలుషితం అయ్యిందని దుర్వాసన వస్తుందని పరిసరాల్లో ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. రెండు బావుల నీరు గతంలో ప్రజలకు సరఫరా చేసే వారని, నీటిట్యాంకుల నిర్మాణం, కొత్త బోర్ పైపులైన్ల ఏర్పాటుతో బావులను వాడుకోవడం లేదని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీ ఇప్పుడు జీహెచ్ఎంసిగా అభివృద్ధి చెందినప్పటికి పాడుబడ్డ బావులు అలాగే ఉండగా పిల్లలు, పశువులు, మేకలు, కుక్కలు బావుల్లో పడే ప్రమాదం ఉందని అధికారులు స్పందించి పారిశుద్య నిర్మూలనలో భాగంగా నిరుపయోగంగా ఉన్న బావులను పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# అలియాబాద్‌లో గెలుపు కోసం బిఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** మున్సిపల్ కేంద్రమైన అలియాబాద్ గ్రామంలో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పర్యటించి ఇంటింటా ప్రచారం చేశారు. సోమవారం మధ్యాహ్నం అలియాబాద్ గ్రామంలో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన వార్డులో ఇంటింటా పర్యటించి బిఆర్ఎస్‌ను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు అలియాబాద్ గ్రామంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కూడ పర్యటించి ఇంటింటా ప్రచారం చేస్తూ బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, బిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అలియాబాద్‌లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేసిన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,పాల్గొన్న అభ్యర్థి బండి లక్ష్మిరాంరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి,పలువురు నాయకుల దృశ్యం

# సారధిగా గెలిపించండి.. వారధిగా ఉంటా

### కాంగ్రెస్ నేత సంతోషి చందు

**షాద్‌నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** సారథిగా సంతోషి బాయ్‌ని గెలిపించండి.. మీ వారధిగా వెన్నంటే నేనుంటా.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ప్రగతి కాంతులు అందిస్తా.. అని కాంగ్రెస్ నాయకుడు జమాల్ పూర్ చందు అన్నారు. పట్టణంలోని 18 వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించడంతో పాటు, ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. గత కొద్ది రోజులుగా ప్రచారంలో వేగంగా దూసుకుపోతున్న చందూ దంపతులు వార్డులో విస్తృతంగా తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వారికి భారీ స్పందన వస్తుంది. కాంగ్రెస్ పాలన పట్ల, గృహ జ్యోతి, ఉచిత బస్సు ఇలాంటి పథకాలతో పూర్తిస్థాయి సంతృప్తిలో ఉన్న ప్రజలు చందు దంపతుల పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారు. ఈ క్రమంలో ఈ వార్డులో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని అనిపిస్తుంది. ప్రజల ఆదరణ మరువలేనిది.జమాల్ పూర్ చందు 18వ వార్డులో ప్రచారంలో భాగంగా అక్కడి ప్రజలు చెబుతున్న ఆదరణ మరువలేనిదని జమాల్ చందు, సంతోషి బాయ్ దంపతులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 వ వార్డు గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నో సమస్యలు ఉన్నాయని, వాటిని తీర్చేందుకు అంకితభావంతో కృషి చేస్తానని వెల్లడించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వార్డును అభివృద్ధి చేసేందుకు నిధులు సేకరించి సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. కంప్లీట్ ఇచ్చినాను ఎన్ని కలలో విజయం సాధించిన వెంటనే అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని స్పష్టం చేశారు.


ప్రచారంలో పాల్గొన్న జమాల్ పూర్ సంతోషిబాయి చందు


నందిగామ రజక సంఘం నూతన కార్యవర్గం

## రాజ్యాధికారం కోసం రజకులు ఏకం కావాలి

### నందిగామ రజక సంఘం అధ్యక్షులు యాదగిరి

**నందిగామ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** రాజ్యాధికారం కోసం వెనుకబడిన రజకులు ఏకం కావాలని నందిగామ రజక సంఘం అధ్యక్షులు సి యాదగిరి పిలుపునిచ్చారు. సోమవారం నందిగామ మండల కేంద్రంలో గ్రామరజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, పార్టీలు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న వెనుకబడిన రజకులు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనను రజక సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు రజక సంఘం అభివృద్ధి సంక్షేమం కోసం సాయి శక్తులాకృషి చేస్తామన్నారు. మాజీ అధ్యక్షుడు ఆర్ యాదగిరి, మాజీ అధ్యక్షులు సి బాలరాజ్, నూతనంగా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన బోర్ర ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సి రాంబాబు, కార్యదర్శులుగా వీరయ్య, శివాజీ, సిద్దులు , సలహాదారులు సి రమేష్,సి యాదయ్య, కోశాధికారి, సి చందు లను ఎన్నుకున్నారు. సభ్యులుగా యాదయ్య, విశ్వనాథ్, నరసింహ, చెన్నయ్య, రవి, యాదయ్య ,నాగయ్య, వినయ్, లింగం ,నరసింహ ఉన్నారు.


ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన శంకర్

## దుద్యాల్ ఎంఈవోగా శంకర్ బాధ్యతల స్వీకరణ

**దుద్యాల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** దుద్యాల్ మండల ఇన్చార్జ్ ఎంఈవోగా హకీంపేట్ జీహెచ్ఎం శంకర్ బాధ్యతలు స్వీకరించారు. దుద్యాల్ ఎమ్మార్సీలో రిటైర్డ్ ఎంఈవో విజయ రామారావు శంకర్ కు బాధ్యతలు అప్పగించారు. నూతన ఎంఈవో శంకర్‌ను వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించి, దుద్యాల్ మండలంలో విద్యాపరంగా నైపుణ్యవంతమైన విద్య ప్రతి బడి ఈడు పిల్లలకు చేరే విధంగా కృషి చేయాలని, ముఖ్యమంత్రి నియోజకవర్గం కాబట్టి అన్ని విధాలుగా విద్యాభివృద్ధికి కృషి చేస్తూ ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో విద్యాభివృద్ధికి కృషి చేద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, పిఆర్టియు మండల అధ్యక్షులు నరేందర్, వెంకటయ్య, యుటిఎఫ్ అధ్యక్షులు కూర నరసింహులు, రాములు, టిఎస్టియు జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, మండల అధ్యక్షులు ఆంజనేయులు, తపస్ అధ్యక్షులు శంకరప్ప, తేజస్విని, మల్లప్ప, ముకుంద రెడ్డి, సాలి బాయి, మాధవి, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

### మోమిన్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ సిరాజుద్దీన్

**మోమిన్‌పేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** వికారాబాద్ మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని మోమిన్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ వారాల సిరాజుద్దీన్ అన్నారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్ చివరి రోజు ప్రచార అనంతరం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో వికారాబాద్ మున్సిపాలిటీ అత్యంత మెజారిటీతో గెలిచి అభివృద్ధి చేయడం ఖాయమని అన్నారు. గడ్డం అనన్య చైర్పర్సన్ పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే అభివృద్ధి వేగంగా పుంజుకుంటుందని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని గారడి మాటలు చెప్పినా గడిచిన పదేండ్లలో కనీసం రెండు వార్డులు కూడా అభివృద్ధికి నోచుకోలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసే ప్రతి అభ్యర్థి రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తులని, అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేసే వారికి అవకాశం కల్పించిన రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్ అభివృద్ధే లక్ష్యంగా కంకణం కట్టుకున్న వ్యక్తి అని పేర్కొన్నారు. ఈసారి మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య భారీ మెజారిటీతో విజయం సాధించి వికారాబాద్ ప్రాంతం అన్ని రకాల అభివృద్ధి చేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నేడు ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో ఆయన ప్రచారంలో భాగంగా వార్డుల్లో పర్యటించి అక్కడి ఓటర్ల అభిప్రాయాన్ని సేకరించిన సమాచారాన్ని బట్టి ఈసారి కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఎగురవేయడం ఖాయమని అన్నారు. వికారాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు.


ప్రభాతవార్తతో మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ సిరాజుద్దీన్.


ప్రచారంలో పాల్గొన్న ఈగ వెంకట్రాంరెడ్డి

# ఓటర్ల మనసు దోచేస్తాడా?

### ఇంటింటినీ చుట్టేసిన ఈగ వెంకట్రామిరెడ్డి..

### 23వ వార్డులపై బిఆర్ఎస్ భారీ అంచనాలు

**షాద్‌నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** వార్డు కాని వార్డులోకి వచ్చాడు.. ఏం చేస్తాడులే.. అనుకున్నారు.. కానీ చాప కింద నీరులా మొదలయ్యాడు.. ఇప్పుడు ఏకంగా పొంగుతున్న యేరులా మారాడు.. పట్టణంలోని 23వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి ఈగ వెంకట్రాంరెడ్డి దూకుడు ఇది. ఒక్క క్షణం కూడా విరామం లేకుండా ఇంటింటికి వెళుతూ, ప్రతి ఓటరును ప్రేమగా పలకరిస్తూ ముందుకు సాగుతున్న వెంకట్రాంరెడ్డి తనను గెలిపించాలని కోరారు. విసుగు, విరామం లేకుండా తిరుగుతున్న అతన్ని చూసి ఓటర్లు ఆశ్చర్య పోతున్నారు. క్రమక్రమంగా అతనిపై అభిమానం పెంచుకొని అతని వైపు తిరుగుతున్నారు. అభ్యర్థులకు అర్థం కాని రీతిలో ఓటర్లను తన వైపుకు తిప్పుకుంటూ ఈగ వెంకట్రాంరెడ్డి సాగుతున్న తీరు ఆకట్టుకుంటుంది. సోమవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా నేతలు, కార్యకర్తలు, మహిళలతో కలిసి ఇంటింటికి తిరిగిన ఆయన కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ప్రచారం చివరి రోజు తీసిన ర్యాలీ వార్డు ప్రజలను బాగా ఆకట్టుకుంది.. వార్డు ప్రగతి నా లక్ష ్యం.. ఈగ వెంకట్రామిరెడ్డి.. వార్డు ప్రగతి లక్ష ్యంగా ముందుకు సాగుతున్నానని బిఆర్ఎస్ అభ్యర్థి ఈగ వెంకట్రామిరెడ్డి అన్నారు. గతంలో తన వార్డును అభివృద్ధి చేసినట్లే 23వ వార్డులు కూడా ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతారని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. వార్డులో రహదారుల సమస్యలు, కాలువల సమస్యలు, ఇతర సమస్యలను పరిష్కరిస్తానని ఆయన స్పష్టం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు.